క్లుప్తంగా

రేపటితో 'దోస్త్' ముగింపు

పరకాల : డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రవేశపెట్టిన దోస్త్ దరకాస్తుల స్వీకరణ ఈనెల21న ముగియనున్నట్లు పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సు చేయాలనుకునే విద్యార్థులు గడువు లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



వేలేరు : ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తిలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని పీచర గ్రామంలో సోమవారం ఆపార్టీ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేసేవిధంగా ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కోరారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పార్టీ రాజకీయ లక్ష్యాలను ప్రజల ముందు ఉంచి సమస్యలపై చైతన్యవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పార్టీ కమిటీలు వేయాలని మండల నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల శంకర్, జుర్రు సంపత్, మైసయ్య, రాజు, నరేశ్, రవి పాల్గొన్నారు.

అందుబాటులో జనుము, జీలుగ విత్తనాలు

దామెర : రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ అల్లె రాకేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని వడ్డెపల్లి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు లభించనున్నట్లు తెలిపారు. జీలుగ 30 కిలోల బస్తా సబ్సిడీ వాటా మిహాయించి రూ.2,137 ఉంటుందని తెలిపారు. జనుము 40 కిలోల బస్తా సబ్సిడీ వాటా మినహాయించి రూ.2,510 ఉంటుందని, ఆసక్తి కలిగిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు రైతు సేవాకేంద్రంలో సమర్పించి విత్తనాలు పొందాలని కోరారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు అంబాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో మంగళవారం నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ ఎం.రాజ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి మొదటి విడతగా 1665 బస్తాల జీలుగ విత్తనాలు వచ్చాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఏఈఓలను సంప్రదించి టోకెన్ పొంది జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. 30 కిలోల జీలుగ బస్తాను 50 శాతం సబ్సిడీపై రూ.2,140కి అందించనున్నట్లు తెలిపారు.

హిందూ ఏక్తాయాత్రకు తరలిరావాలి

ఎల్కతుర్తి : ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు జరిగే హిందూ ఏక్తాయాత్రకు కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామోజ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో పార్టీ నాయకులతో కలిసి హిందూ ఏక్తా యాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. హిందూ ఏక్తాయాత్రలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు పృధ్వీరాజ్, నాయకులు సదానందం, భిక్షపతి, వికాస్, కవిత, మల్లారెడ్డి, రమేశ్, సంతోశ్, భద్రయ్య, రాణా ప్రతాప్, అఖీల్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన క్షణికావేశం

భర్త చేయిచేసుకున్నాడని భార్య ఆత్మహత్య



వేలేరు : వ్యవసాయ బావి వద్ద పని చేస్తున్న భార్యను దుర్భాషలాడుతూ చేయిచేసుకున్న కారణంగా మనస్థాపానికి గురైన ఆమె క్షణికావేశానికి లోనై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని మల్లికుదుర్ల శివారు కుమ్మరిగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన మారుపాక కోమల (45) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. సోమవారం రోజుమాదిరిగానే వ్యవసాయ బావివద్దకు వెళ్లి టామాట తోటలో పనిచేస్తుడంగా ఆమె భర్త కోటేశం వచ్చి చెప్పిన పనిచేయకుండా ఇక్కడ ఏం చేస్తున్నావని దుర్భాషలాడుతూ చేయిచేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన కోమల.. బావివద్ద ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన భర్త, చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. కోమలకు కుమారుడు అరవింద్, కుమార్తె అర్చన ఉన్నారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

రైతులకు ఉపాధి 'హామీ'



పోచారంలో జామయిల్, మునగతోట సాగులో రైతులు



ఉపాధి హామీ పథకంలో నిర్మించిన పశువుల నీటితొట్టి

- వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం
- పశువుల కోసం షెడ్లు, నీటితొట్ల నిర్మాణం
- ఆసక్తి చూపుతున్న రైతులు

పరకాల : వంద శాతం పూర్తి సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం రైతులకు చేయూతగా నిలుస్తోంది. దీంతో పరకాల డివిజన్‌లో అనేక మంది రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టిసారిస్తున్నారు. ఈ పథకానికి ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులు 5 ఎకరాల లోపు భూమి, ఉపాధి హామీ కార్డు కలిగి ఉంటే పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. కొబ్బరి, నారింజ, బత్తాయి, దానిమ్మ, జామ, సపోటా, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్ వంటి ఇతర రకాల పండ్ల మొక్కలు నాటేందుకు అవకాశం కల్పించింది. అదే విధంగా మునగ తోటలు, జామయిల్, ఆయిల్ పామ్ మొక్కలను కూడా రైతులు వారి భూముల్లో పెంచుకోవచ్చు. దీనికి గాను మొక్కలు నాటేందుకు గుంతల తీయడం, కూలీల ఖర్చు, మూడు సంవత్సరాల వరకు ఉపాధి హామీ ద్వారా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం అందించనుంది. రైతులకు అవసరమయ్యే వ్యక్తిగత పనులు నాడెం కంపోస్టు గుంత, అజోల్ల పెంపకం, పశువుల షెడ్లు వంటి పనులు కూడా ఉపాధి హామీ పనిలో వంద శాతం సబ్సిడీతో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

150 ఎకరాల్లో పండ్ల తోటలు

డివిజన్‌లోని శాయంపేట, పరకాల, దామెర, ఆత్మకూరు, నడికూడ మండలాల పరిధిలో సుమారు 150 ఎకరాల్లో 50 మంది రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు, జామాయిల్, ఆయిల్ పామ్‌లు సాగుచేస్తున్నారు. దీంతో ఇతర రైతులు సైతం ఆకస్తి కనబరుస్తున్నారు.

రైతులకు గొప్ప అవకాశం



రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవడం లేదా పశువుల షెడ్లు నిర్మాణం చేసుకోవచ్చు. ఆసక్తి గల రైతులు గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి వద్ద పేరు నమోదు చేసుకోవాలి. ఉపాధి హామీ పథకంలో కల్పిస్తున్న ఈ సదుపాయం రైతులకు గొప్ప అవకాశం. మండలంలోని అర్హులందరూ వినియోగించుకోవాలి.

\- ఇందిరా, ఏపీఓ, పరకాల

యూరియా వినియోగం తగ్గించాలి



మాట్లాడుతున్న డాక్టర్ భార్గవి

ధర్మసాగర్ : రైతులు పంటసాగులో యూరియా వినియోగం తగ్గించాలని వరంగల్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ అర్చన కుమారి సూచించారు. మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో సోమవారం వరంగల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటసాగులో ముఖ్యమైన అంశాలను వివరించారు. యూరియా తగ్గించి వాడటం, పంట మార్పిడి, చెట్ల పెంపకం, రసాయనాల వాడకం తగ్గించడం, రశీదులను భద్రపర్చడం, సాగు నీటిని ఆదా చేయటం వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా వివిధ పంటల్లో పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేశ్, ఏఈఓ జయశ్రీ, వ్యవసాయ కళాశాల సిబ్బంది, రెతులు పాల్గొన్నారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎంపీ ఈటల, ఒడితల ప్రణవ్.



కమలాపూర్ : మండలంలోని గూడూరులో శ్రీఅభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజ స్తంభ స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పారాయణం, పీఠ సంస్కరణ, గర్తన్యాసం, బీజన్యాసం, రత్నన్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజ స్తంభ స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, అష్టబలి, దృష్టికుంభ బలిహరణ, నేత్రోన్మిలనం, హారతి, కుంభ ఉద్వాసన, కుంభ ప్రోక్షణ, మహదాశీర్వచనం, ఆచార్య సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భద్రకాళి-వీరభద్ర ఆరాధన, సుంకు పూజ, అగ్నిప్రతిష్ట, రాత్రి అష్టదిగ్బంధన పూజ, అష్టబలి, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వేద పండితులు మఠం విజయ్‌కుమార్ స్వామి, గిరిమఠం సంపత్‌కుమార్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

హాజరైన ప్రముఖులు

అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజ స్తంభ స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వారి వెంట ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం



వేలేరు : నివాళులర్పిస్తున్న నాయకులు



కాజీపేట అర్బన్ : మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు : ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, సీపీఎం పార్టీ మొదటి జాతీయ కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని సీపీఎం నాయకుడు నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వెంకటాపురం గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య పీడిత ప్రజల కొరకు చేసిన పోరాటాలను, సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు లింగయ్య, నాగరాజు, పోచమ్మ, కవిత, యాకయ్య, నర్సయ్య, సరోజన, దేవమ్మ, ఎల్లమ్మ, మానస, బాబురావు పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్ : కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనలో ముందుకు సాగుదామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య తెలిపారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌లో సీపీఎం నాయకుడు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుందరయ్య 40వ వర్థంతి సభకు ముఖ్య అతిథిగా చుక్కయ్య హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఎం నాయకులు గద్దం అశోక్, సాంబయ్య, సదానందం, మొగిలి పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని కన్నారం శివారు ఇచ్చుల్లపల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్థంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ (ఎం) మండల కార్యదర్శి వేల్పుల రవి, నాయకులు లక్ష్మి, సమ్మక్క,, మధునమ్మ, నవరత్న తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణ బురదమయం



బురదమయంగా మారిన ఆత్మకూరు బస్టాండ్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణమంతా ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వేసవిలో కురిసే ఒక్క వానకు బస్టాండ్ ఇలా మారితే రానున్న వర్షాకాలంలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల బస్టాండ్‌లోకి బస్సులు వస్తున్నప్పటికీ సోమవారం ఉదయం మాత్రం బురదమయంగా మారడంతో బస్సులు బస్టాండ్‌లోకి రాలేదని ప్రయాణికులు తెలిపారు. ఆత్మకూరు నుంచి నిత్యం ములుగు ఏటూర్‌నాగారం వైపు వందలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. వీరికి సౌకర్యంగా ఉండాల్సిన బస్టాండ్ అసౌకర్యంగా మారడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కూడా కరువయ్యాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే మార్గంలో గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని, ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

కమలాపూర్ : మాదన్నపేటలో రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని నాణ్యత లేకుండా నిర్మించిన కాంట్రాక్టర్‌పై, ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు మండ రఘుపతి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని గతంలో తాము కొంత మేర నిర్మించుకున్నామని, మిగతా పనుల కింద గుడికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి సీజీపీ నిధులు రూ.12 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. అధికారుల అండతో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకం ఇసుక, సిమెంట్ వాడి వాటర్ క్యూరింగ్ చేయలేదని ఆరోపించారు. నాసిరకం పనులపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్‌ను అడిగితే దురుసుగా సమాధానం చెప్పాడమే కాకుండా పనులు నిలిపివేసి ఆలయ కమిటీకి ఎలాంటి సమాచారం లేకుండానే పనులు పూర్తయ్యాయని బోర్డు పెట్టి బిల్లు రికార్డు చేసుకున్నాడని ఆరోపించారు.

ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ



తనిఖీ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ధర్మసాగర్ : మండలంలోని 19 గ్రామాల్లో నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏప్రిల్ 01, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈనెల 06 నుంచి నుంచి 18వ తేదీ వరకు పలు పనులను, రికార్డులను తనిఖీ చేపట్టి నివేదికను అధికారులు చదివి వినిపించారు. 19 గ్రామపంచాయతీల్లో చేపట్టిన రూ.3,47,69,627 కోట్ల పనులకు సంబంధించిన రికార్డులు, పనులను పరిశీలించారు. అందులో భాగంగా రూ.23,925 పనులకు అభ్యంతరం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, డీపీఎస్ నరసింహారెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ సంపత్, జేఈ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

దామెర : భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ అవలంభిస్తున్న విధానాలపై ఉద్యమించాలన్నారు. మంగళవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



పరకాల : వ్యవసాయ మార్కెట్‌కు చేరుకునే రైతులకు పూర్తి సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ఏలాంటి సమస్యలున్న తమకు ఫిర్యాదు చేయాలని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్‌లో 2వేల మెట్రిక్ టన్నుల నిల్వచేసే ధాన్యం బస్తాల గోదాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం కష్టపడుతుందన్నారు. అదే విధంగా మార్కెట్‌పై నమ్మకంతో వచ్చే రైతులకు ఏలాంటి అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులతో పాటు సిబ్బందిపై ఉందన్నారు. రైతులకు ఏలాంటి సమస్య తలెత్తిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డైరెక్టర్లు దాసరి భిక్షపతి, చంద్రమౌళి, కుమారస్వామి, మార్కెట్ జిల్లా మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కీంలకు, స్కాంలకు తేడా తెలియదా..?

- కాంగ్రెస్ పాలనను చూసి కళ్లు మండుతున్నాయా..?
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌కు ప్రణవ్ కౌంటర్



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రణవ్

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవినీతిని ఆధారాలతో నిరూపించాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి సవాల్ విసిరారు. మండలంలోని ఉప్పల్‌లో భీంరావు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను సోమవారం ప్రణవ్ ప్రారంభించారు. గూడూరులో శ్రీ అభయాంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజస్తంభ స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని, భీంపల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం కమలాపూర్‌లో యువజన కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించి అక్కడే మండలానికి మంజూరైన రూ.14.45 లక్షల విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 36 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లల్లో అతి పెద్ద స్కాం జరిగిందని ఆరోపించిన ఎమ్మెల్యేకు అసలు స్కాంకు, స్కీంకు తేడా తెలుసా అని ప్రశ్నించారు. పచ్చ కామెర్లు ఉన్నోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక స్కాంలు జరిగాయని, దాంతో ఏ స్కీం పెట్టినా స్కాం ఉంటుందనేది వారి ఆలోచనా విధానమని ఎద్దేవా చేశారు. గాలిమాటలు మాట్లాడకుండా స్కాములను ఆధారాలతో నిరూపించాలని, బీఆర్ఎస్ చేసే ఆరోపణలకు ఆ పార్టీ వాళ్లే నవ్వుకుంటున్నారని విమర్శించారు. రెండేళ్లు విప్‌గా ఉండి ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించలేని వారు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరవీందర్, డైరెక్టర్లు, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలంతా ఏకంకావాలి



మాట్లాడుతున్న ఉపేందర్ మాదిగ

ధర్మసాగర్ : మాదిగలంతా రాజకీయంగా ఎదగాలని, అందుకు ఏకంకావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, హక్కులను, రాజకీయ చైతన్యాన్ని అందించిన ప్రజా నాయకుడు మంద కృష్ణ మాదిగ సారథ్యంలో మాదిగలు రాజకీయాలకతీతంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించడం గర్వకారణమన్నారు. మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా మన ఆత్మీయంగా సత్కరించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకోసం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంగా త్వరలో మంద కృష్ణమాదిగకు ఆత్మీయ అభినందన సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ మాదిగ బిడ్డ తరలిరావాలని పిలుపునిచ్చారు. మండల ఇన్‌చార్జ్ జేరిపోతుల సుధాకర్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, నాయకులు సందేన రవీందర్, బొడ్డు శాంతిసాగర్, శంషోద్దీన్, పుట్ట ప్రణయ్, పవన్, బొడ్డు ప్రణయ్, అనిల్, శంకర్, బాబు, శ్రావణ్ కుమార్, విజయ్‌భాస్కర్, శ్రీను, పోలు, సంజయ్, వినయ్ తేజ్, రాఖీ, దిలీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులు.. ఆందోళన వద్దు

- డివిజన్ ఉద్యానశాఖ అధికారి సుస్మిత



రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ సుస్మిత

ఐనవోలు : ఆయిల్ పామ్ సాగుచేసే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సుస్మిత భరోసా కల్పించారు. మండలంలోని కక్కిరాలపల్లి రెవెన్యూ పరిధిలోని పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన వరంగంటి కొమ్మాలు, చేరాలు ఆయిల్‌పామ్ క్షేత్రంలో సోమవారం ఉద్యానశాఖ, కేఎన్ బయోసైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఓ సుస్మిత మాట్లాడుతూ.. ఆయిల్ పామ్‌లో ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, డ్రిప్పు ద్వారా ఎరువులు పంపే విధానంతో పాటు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడికి కృషి చేయాలన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంచేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.21 వేలు ఉందని తెలిపారు. కేఎన్ బయోసైన్సెస్ కంపెనీ వారు రెండు చోట్ల బీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని బావ్‌పేట్‌లో ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కేఎన్ బయో జిల్లా మేనేజర్ రంజిత్, ఫీల్డ్ ఆఫీసర్ విక్రమ్, నాథన్, రైతులు శ్రీనివాస్, రాజిరెడ్డితో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఐనవోలు : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని బీఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అల్లం సోమయ్య ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కంజర్ల రమేశ్, మాజీ ఉప సర్పంచ్ బొల్లం ప్రకాశ్, మాజీ వార్డు సభ్యుడు కాటబోయిన కుమారస్వామితో పాటు సుమారు 20 మంది నాయకులు కక్కిరాలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్మల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రమేశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభ ఏర్పాటు చేసి అర్హులైన వారి ఎంపిక జరిగిందన్నారు. ఎంపిక జాబితాను నోటీస్ బోర్డుపై అంటించి అభ్యంతరాలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు అదే పార్టీకి చెందిన వారితో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసుకుని తమకు నచ్చిన వారికి ఇళ్ల కేటాయింపు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో యాదగిరిరావు, భిక్షపతి, యాదగిరి, వెంకటేశ్వర్‌రావు, కుమారస్వామి, నాగరాజు, రఫిక్, కుమార్, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

సైలాని బాబా ఉత్సవాలకు భారీ బందోబస్తు

- డీసీపీ అంకిత్‌కుమార్



సైలానిబాబా దర్గాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

దామెర : సైలాని బాబా దర్గాలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న ఉత్సవాలకు భారీ బందోబస్తు చేపట్టనున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానిబాబా దర్గాలో ఈనెల 21 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న 118వ గంధం ఉర్సు ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ షాతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బారికేడ్లు ఏర్పాటుచేసి పార్కింగ్‌కు వెళ్లే వాహనాలను మళ్లించాలని అన్నారు. ఆయన వెంట పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్, ఆమీర్‌బాబా, తదితరులు ఉన్నారు.